క్లుప్తంగా

పక్కాగా దివ్యాంగుల గుర్తింపు



మాట్లాడుతున్న జడ్జి జ్యోత్స్న

పొందూరు: దివ్యాంగులకు ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలు సక్రమంగా అందాలంటే, పక్కాగా గుర్తింపు సర్వే చేపట్టాలని పొందూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు జడ్జి బి.జ్యోత్స్న సూచించారు. హైకోర్టు ఆదేశాల మేరకు దివ్యాంగుల సర్వేపై పొందూరు, జి.సిగడాం మండలాలకు చెందిన సంబంధిత అధికారులతో కోర్టు ప్రాంగణంలో శనివారం సమావేశం నిర్వహించారు. దివ్యాంగుల గుర్తింపునకు ప్రామాణికంగా తీసుకుంటున్న సదరన్ ధ్రువపత్రంతో పాటు, సదరన్ ధ్రువపత్రాలు లేని దివ్యాంగులను సైతం గుర్తించి నమోదు చేయాలని ఆదేశించారు. సమావేశంలో సచివాలయం మహిళా పోలీసులు, ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

గుర్తింపు కార్డు తప్పనిసరి



ఎస్.హనుమంతురావు, తహసీల్దార్

హిరమండలం: ఈనెల 27న జరగనున్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు, ఉపాధ్యాయ ఓటర్లు తప్పనిసరిగా గుర్తింపు కార్డు తీసుకెళ్లాలని తహసీల్దార్ ఎస్.హనుమంతురావు సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ.. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు పక్కాగా చేపట్టనున్నట్లు తెలియజేశారు. ప్రశాంత ఎన్నికలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. శాంతియుతంగా ఎన్నికలు జరిపేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామన్నారు.

నేటి నుంచి దుర్గాదేవి జాతర



పూజలందుకుంటున్న దుర్గాదేవి

పొందూరు రూరల్: మండలంలో తండ్యాం పంచాయతీలోని ఎస్ఆర్ఎస్ కాలనీలో వెలసి ఉన్న దుర్గాదేవి 31వ జాతర మహోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభమవ్వనున్నాయి. ఈనెల 16వ తేదీ నుంచి 18 వరకు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. 18న భారీ అన్నసమారాధన జరుగుతుందని చెప్పారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

బీమా చెక్కు అందజేత



సుశీలకు చెక్కు అందజేస్తున్న దృశ్యం

కొత్తూరు: మండలంలోని మాకవరం గ్రామానికి చెందిన చీకటి సుశీలకు నివగాం ఎస్‌బీఐ బ్రాంచిలో రూ.2 లక్షల పీఎంజేజేబీవై చెక్కును మేనేజర్ సాయి సుమాన్ శనివారం అందజేశారు. సుశీల భర్త శ్రీనివాసరావుకు నివగాం ఎస్‌బీఐలో అకౌంట్ ఉంది. ఆయన పీఎంజేజేబీవై పథకానికి తన ఖాతా నుంచి ప్రీమియం చెల్లించారు. కాగా ఇటీవల శ్రీనివాసరావు అనారోగ్యంతో మృతి చెందడంతో బీమా సొమ్మును అతని భార్య సుశీలకు అందజేశారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

అధ్యక్షుడిగా తాండ్ర



ఎన్నికైన సభ్యులకు డిక్లరేషన్ ఫారం అందజేస్తున్న దృశ్యం

ఆమదాలవలస: నియోజకవర్గ మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా తాండ్ర జనార్దనరావు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల కమిటీ సభ్యులు విశ్రాంత లెఫ్టినెంట్ కల్నల్ పి.ఎస్.రావు, విశ్రాంత సుబేదార్ గురుగుబెల్లి సత్యనారాయణ, విశ్రాంత సుబేదార్ మేజర్ సంజీవరావు, హానరరీ కెప్టెన్ జామి రమణయ్యలు శనివారం ప్రకటించారు. ఈ మేరకు పట్టణంలో వారు మాట్లాడుతూ.. నియోజకవర్గ మాజీ సైనికుల సంక్షేమ సేవా సంఘం తరఫున ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చి, ఫిబ్రవరి 12వ తేదీ రాత్రి 8 గంటల వరకు నామినేషన్లు స్వీకరించినట్లు తెలియజేశారు. గడువులోగా ఒక్క నామినేషన్ మాత్రమే దాఖలవ్వడంతో తాండ్ర జనార్దనరావు ప్యానెల్‌ను ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించి, డిక్లరేషన్ ఫారాలు అందజేశామని పేర్కొన్నారు. ప్యానెల్‌లో ఉపాధ్యక్షుడిగా పైడి సూర్యారావు, జనరల్ సెక్రటరీగా నానుపాత్రుని రామారావు, కోశాధికారిగా బొడ్డేపల్లి శ్రీనివాసరావు, కో–ఆర్డినేటర్‌గా పొన్నాడ శ్రీనివాసరావు ఉన్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో జిల్లా మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కటకం పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

ముంచుకొస్తున్న వేసవి..

ముందస్తు చర్యలేవీ..?



దబ్బపాడు వద్ద వంశధార నదిలో చెలమ నుంచి తాగునీరు సేకరిస్తున్న మహిళలు

- అడుగంటుతున్న బోర్లు, బావులు
- ఎండిపోతున్న చెరువులు, నదులు
- మొదలైన తాగునీటి ఇబ్బందులు
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పాలకులు, అధికారులు



కవిటిలో కుళాయి వద్ద ఖాళీ బిందెలు

ఎల్.ఎన్.పేట: వేసవి ప్రారంభానికి ముందే గ్రామాల్లో దాహం కేకలు మొదలయ్యాయి. లక్షలాది కుటుంబాలకు తాగునీరు, వేలాది ఎకరాలకు సాగునీరు అందిస్తున్న జీవనదులు అడుగంటిపోతున్నాయి. గతేడాది నవంబర్ తర్వాత నుంచి వర్షాలు లేకపోవడంతో ప్రజల దాహార్తిని తీర్చే బావులు, బోర్లు కూడా ఎండిపోతున్నాయి. జల్ జీవన్ మిషన్ కుళాయిలు నుంచి సైతం నీరు రాకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. దీంతో ఈ ఏడాది వేసవి ఎలా గడుస్తుందోనని ప్రజలకు ఇప్పటినుంచే భయాందోళనలు పెరుగుతున్నాయి.

దాహార్తి తీరేనా..?

ఎల్.ఎన్.పేట మండలంలోని 26 గ్రామాలకు తాగునీరు అందించేందుకు రూ.13 కోట్ల ఖర్చుతో నిర్మించిన మెగా రక్షిత తాగునీటి పథకం ఎప్పుడు పనిచేస్తుందో.. ఎప్పుడు మొరాయిస్తుందో తెలియని దుస్థితి నెలకొంది. రావిచెంద్రి, దబ్బపాడు, కృష్ణాపురం, సుమంతాపురం తదితర గ్రామాల్లో తాగునీటి పథకాలు పనిచేయకుండా దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. హిరమండలం, పాతపట్నం, కొత్తూరు, మెళియాపుట్టి మండలాల్లోని అనేక గ్రామాల్లో ఇదే దుస్థితి ఉంది. పథకాలు బాగు చేయించేందుకు అధికారులు, పాలకులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నియోజకవర్గంలో...

మండలం	జనాభా	తాగునీటి పథకాలు	బోర్లు	బావులు
ఎల్.ఎన్.పేట	31,107	11	216	27
హిరమండలం	52,018	16	214	38
కొత్తూరు	68,453	14	426	74
పాతపట్నం	80,639	34	288	56
మెళియాపుట్టి	52,737	19	306	82

అడుగడుగునా నిర్లక్ష్యం

వేసవికాలంలో ఎండ వేడిమితో పాటు తాగునీటి కొరత అంతే స్థాయిలో ఉంటుంది. దీంతో ప్రజల దాహార్తిని తీర్చేందుకు పాలకులు, అధికారులు ప్రత్యేక నిధులు కేటాయించాల్సిన అవసరం ఉంది. అవసరమైన గ్రామాలకు ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వాటర్ ట్యాంకుల ద్వారా తాగునీరు సరఫరా చేయాల్సి ఉంటుంది. అయితే ఇప్పటివరకు అధికార యంత్రాంగం తాగునీటి సమస్యల నివారణ కోసం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో, రానున్న వేసవి ఎలా గడుస్తుందోనని ఇప్పటినుంచే ఆందోళన చెందుతున్నారు. పథకాలు సక్రమంగా పనిచేయకపోవడం వలన భవిష్యత్‌లో తాగునీటికి ఎన్ని తిప్పలు పడాలోనని పలువురు వాపోతున్నారు.



లక్ష్మీనర్సుపేట మెగా రక్షిత తాగునీటి పథకం

తాగునీటికి ఇబ్బందే



కొండల దిగువున ఉన్న మా జంబాడ గ్రామంలో రెండు బోర్లు ఉన్నాయి. అయితే ఆ బోర్లు ఎప్పుడు పనిచేస్తాయో తెలియని పరిస్థితి ఉంది. పాత బోరు కొన్ని నెలలుగా పనిచేయడం లేదు. బాగు చేస్తామని బోరు నుంచి సామాన్లు తీసేశారు. ఇప్పటివరకు బిగించలేదు. వేసవిలో తాగునీటికి ఇబ్బందులు తప్పవని ఆందోళనగా ఉంది.

– బిడ్డిక ఈశ్వరమ్మ, జంబాడ, ఎల్.ఎన్.పేట

ఊరూరా పరిశీలన

తాగునీటి ఇబ్బందులు గుర్తించడంతో పాటు తక్షణం తీసుకునే చర్యలపై ప్రణాళిక ప్రకారం పనిచేసేందుకు మెకానిక్‌లను సిద్ధం చేశాం. ఊరూరా వెళ్లి పనిచేస్తున్న బోర్లు, పథకాల వివరాలు వారు తెలుసుకుంటారు. తక్షణమే మరమ్మతులు చేపట్టడంతో పాటు వేసవిలో తాగునీటికి ఇబ్బంది లేకుండా ఉండేందుకు తీసుకునే చర్యలను నివేదిస్తారు. వెంటనే తగిన చర్యలు చేపట్టి తాగునీటి ఇబ్బంది లేకుండా చేస్తాం.

– సీహెచ్ అప్పలనాయుడు, డీఈ ఆర్‌డబ్ల్యూఎస్, పాతపట్నం

పారిశుద్ధ్య పనులు



బూర్జ మండలంలోని పాలవలస గ్రామంలో పారిశుద్ధ్య పనులు శనివారం చేపట్టారు. గ్రామంలోని మురికి కాలువల్లో పూడికలు తొలగించి సుదూర ప్రాంతాలకు తరలించారు. అలాగే బోరు బావులు, నేల బావుల్లో బ్లీచింగ్ వేసి క్లోరినేషన్ చేయించారు. రానున్న వేసవి దృష్టిలో పెట్టుకొని పారిశుద్ధ్య నిర్వహణ చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

– బూర్జ

ఆకస్మిక తనిఖీ



నరసన్నపేట ఎంఎల్ఎస్ పాయింట్ గోదామును జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గోదాములో ఉన్న సరుకులు, పరిసరాలను పరిశీలించారు. పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడాన్ని గమనించి అసంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే నిల్వల రికార్డులను పరిశీలించారు. ప్రతీ మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్రా – స్వచ్ఛ దివాస్ కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. అనంతరం పరిసరాల్లో మొక్కలు నాటారు.

– నరసన్నపేట

మూలుగుతున్న ధాన్యం



సారవకోట మండలంలోని అవలింగి సచివాలయం పరిధిలో ఖరీఫ్ ధాన్యం నిల్వలు రోడ్డు పక్కన మూలుగుతున్నాయి. ధాన్యం కొనుగోళ్ల లక్ష్యం పూర్తవ్వడంతో డిసెంబర్ నుంచి కొనుగోళ్లు నిలిచిపోయాయి. దీంతో అవలింగి సచివాలయ పరిధిలో సుమారు 4 వేలు నుంచి 5 వేలు బస్తాలు రోడ్డుపక్కన రైతుల కల్లాల్లోనే ఉండిపోయాయి. బయట మార్కెట్లో తక్కువ ధరలకు వ్యాపారులు, మిల్లర్లు అడుగుతున్నారని రైతులు వాపోతున్నారు.

– సారవకోట

ఎక్కువ కేసులు పరిష్కారమవ్వాలి



మాట్లాడుతున్న సివిల్ జడ్జి చందన హరిప్రియ

నరసన్నపేట: మార్చి 8వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో వీలైనన్ని ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని నరసన్నపేట జూనియర్ సివిల్ జడ్జి చందన హరిప్రియ సూచించారు. కోర్టు మెయిన్ హాల్‌లో నరసన్నపేట, పోలాకి అధికారులు, ఎక్సైజ్ అధికారులతో పాటు కోర్టు న్యాయవాదులతో సమీక్ష సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రిమినల్, సివిల్ కేసులు పరిష్కారమయ్యేలా కక్షిదారులకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో నరసన్నపేట సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐలు దుర్గాప్రసాద్, రంజిత్, గురుమూర్తి, న్యాయవాదులు గణేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గోదాం నిర్మాణానికి నిధులు మంజూరు



రోడ్డు నిర్మాణం కోసం సర్వే చేపడుతున్న సిబ్బంది

ఆమదాలవలస: పట్టణంలో ప్రస్తుతం ఉన్నటువంటి వేర్ హౌస్ గోదాంల స్థానంలో, అదనంగా నాలుగు వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాం నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని స్థానిక వేర్‌హౌస్ గోదాంల మేనేజర్ వేణుగోపాలరావు తెలిపారు. వేర్ హౌసింగ్ గోదాములకు రోడ్డు వేసేందుకు, నూతన గోదాం నిర్మాణం చేపట్టేందుకు అధికారులు శనివారం సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఏడాది ఇప్పటివరకు 11,890 మెట్రిక్ టన్నుల బియ్యం వచ్చాయన్నారు. ఎఫ్‌సీఐ గోదాముల్లో ప్రస్తుతం 1000 మెట్రిక్ టన్నుల బియ్యం నిల్వ చేసేందుకు సామర్థ్యం ఉందన్నారు. ఈ ఏడాది బియ్యం సేకరణ సజావుగా జరుగుతోందని పేర్కొన్నారు. ఇటీవల టెక్నికల్ అధికారులు గోదామును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారన్నారు. మెయిన్ రోడ్ నుంచి రోడ్డు వేసేందుకు సిబ్బంది సర్వే నిర్వహించినట్లు మేనేజర్ వేణుగోపాలరావు తెలిపారు.

ముఖ ఆధారిత హాజరు తప్పనిసరి



ఉర్లాం పీహెచ్‌సీ వైద్యులకు సూచనలు చేస్తున్న డీఎంహెచ్‌ఓ బాలమురళీ కృష్ణ

నరసన్నపేట: జిల్లావ్యాప్తంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న సిబ్బందికి ముఖ ఆధారిత హాజరు తప్పనిసరి అని డీఎంహెచ్‌ఓ బాలమురళీ కృష్ణ అన్నారు. ఉర్లాం పీహెచ్‌సీని ఆయన శనివారం తనిఖీ చేశారు. నిర్దేశించిన సమయానికి రావాలని, ఇష్టానుసారం వచ్చి హాజరు వేయడం కుదరదని స్పష్టం చేశారు. రోగులకు అందుబాటులో ఉండాలని, వచ్చిన రోగులకు అన్ని రకాలుగా సేవలు అందించాలని సూచించారు. ప్రతి మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించాలన్నారు. అలాగే ఎన్‌సీడీ-సీడీ, ఎల్‌సీడీసీ సర్వేల వివరాలను సమీక్షించారు. వైద్యులు సుజాత, అరవిందులకు పలు సూచనలు చేశారు. ఈయన వెంట డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ వాన సురేష్ ఉన్నారు.

ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని వక్తలు పిలుపునిచ్చారు. జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో మూడో శనివారం స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటా చెత్త సేకరణలో భాగంగా తడి చెత్త, పొడి చెత్త వేర్వేరుగా అందించేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అలాగే ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని సూచించారు. కార్యక్రమాల్లో అధికారులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



బూర్జ: ర్యాలీ నిర్వహిస్తున్న జూనియర్ కళాశాల విద్యార్థులు



హిరమండలం: ప్రతిజ్ఞ చేస్తున్న డ్వాక్రా మహిళలు, అధికారులు



పాతపట్నం: పేదూరులో ఇంకుడు గుంత పరిశీలిస్తున్న అధికారులు

నాటుసారా పట్టివేత

పాతపట్నం: మండలంలోని కొరసవాడ గ్రామానికి చెందిన బి.నీలయ్య అలియాస్ కాయ నాటుసారా ప్యాకెట్లతో శనివారం పట్టుబడినట్లు ఎక్సైజ్ సీఐ కోట కృష్ణారావు తెలియజేశారు. పాతపట్నం నీలమణిదుర్గ ఆలయం వైపు అక్రమంగా సారా రవాణా చేస్తుండగా ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారన్నారు. సారా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని, నీలయ్యను 14 రోజుల పాటు రిమాండ్‌కు తరలించామని పేర్కొన్నారు.

బహిరంగ మలవిసర్జనతో అనారోగ్యాలు

పొందూరు: ఆరుబయట మల విసర్జన చేయడం వలన ప్రజలు అనారోగ్యాలకు గురవుతారని ఎంపీడీవో మన్మథరావు, ఈవో మోహన్‌బాబు అన్నారు. ఈ మేరకు పట్టణంలో అవగాహన ర్యాలీ శనివారం నిర్వహించారు. ఆరుబయట మలవిసర్జనకు పాల్పడితే జరిమానా తప్పదని హెచ్చరించారు. ఇంటింటికీ వెళ్లి వ్యక్తిగత, సామాజిక పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు, ఆశవర్కర్లు, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ధర్నా నోటీసు అందజేత



ధర్నా నోటీసు అందజేస్తున్న దృశ్యం

సారవకోట: మండల కేంద్రంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు సిబ్బందికి సారవకోట, జలుమూరు మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలు శనివారం ధర్నా నోటీసు అందజేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలంతా ప్రాజెక్టు కార్యాలయం ఆవరణలో సోమవారం ధర్నా చేయనున్నట్లు తెలిపారు. ఎన్నో ఏళ్ల నుంచి తాము ఎదుర్కొంటున్న పలు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ధర్నా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ధర్నాకు సంబంధించిన నోటీసును ఐసీడీఎస్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ రాధాకృష్ణకు అందజేశారు.

ఎమ్మెల్సీ కోడ్ ఉల్లంఘన..?

నరసన్నపేట: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా పట్టణంలోని బైరాగి, నేతాజీ వీధుల మధ్య ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో కూటమి నాయకులు రోడ్డు పనులు ప్రారంభించినట్లు తెలుస్తోంది. వాస్తవానికి మార్చి 8వ తేదీ వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుంది. అయినా వీరు పనులు ప్రారంభించడం కోడ్ ఉల్లంఘన కిందకు వస్తుందని పలువురు చెబుతున్నారు. ఈ విషయాన్ని ఎంపీడీవో మధుసూదనరావు వద్ద ప్రస్తావించగా.. రోడ్డు నిర్మాణానికి ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రెండు నెలల క్రితమే మంజూరయ్యాయని, గతంలోనే వర్క్ ప్రోగ్రెస్‌లోకి వచ్చిందన్నారు. పరిశీలించి వివరాలు తెలుసుకుంటానని తెలియజేశారు.

ప్రకృతి వ్యవసాయంతో మేలు

ఆమదాలవలస రూరల్: ప్రకృతి వ్యవసాయంతో రైతులకు మేలు జరుగుతుందని సిబ్బంది తెలిపారు. ప్రకృతి వ్యవసాయంలో భాగంగా రైతులతో నవధాన్యాల విత్తన సీడ్ ప్లాట్‌ను నిమ్మతొర్లాడ గ్రామంలో శనివారం వేయించారు. గ్రామంలో ఉన్న ప్రతీ రైతుకూ నవధాన్యాల విత్తనాలు అందుబాటులో ఉండేలా క్షేత్రస్థాయిలో సీడ్ ప్లాట్స్ వేయిస్తున్నట్లు తెలిపారు. దీనివలన విత్తన కొరత ఉండని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కృష్ణవేణి, రైతు చింతు సుధాకర్ పాల్గొన్నారు.

స్కూల్ కాంప్లెక్స్ సమావేశం

హిరమండలం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశం శనివారం నిర్వహించారు. స్థానిక హెచ్ఎం కేశవరావు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో 70 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఈవో రాంబాబు మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు బోధన సామర్థ్యం పెంచుకోవాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు



బాధితుడిని ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

హిరమండలం: మండలంలోని అవలంగి గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. 108 అత్యవసర వాహన ఈఎంటీ లింగమూర్తి, పైలెట్ వెంకటేష్ తెలిపిన వివరాల మేరకు.. శుక్రవారం రాత్రి పర్లాఖిమిడి నుంచి ద్విచక్ర వాహనంపై ఎల్ఎన్‌పేట గ్రామానికి చెందిన జ్ఞానబంధు పండా వస్తున్నారు. అదే సమయంలో హిరమండలం నుంచి పాతపట్నం వైపు వెళ్తున్న ఒక ద్విచక్ర వాహనం అవలంగి వద్ద ఆయనను ఢీకొంది. ఈ ప్రమాదంలో జ్ఞానబంధు పండాకు తీవ్రగాయాలయ్యాయి. సమాచారం మేరకు సంఘటన స్థలానికి చేరుకుని చికిత్స కోసం హిరమండలం పీహెచ్‌సీకు తరలించారు. అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

విధుల్లో అప్రమత్తంగా ఉండాలి



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

ఆమదాలవలస: పోలీసు సిబ్బంది విధుల్లో అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి సూచించారు. పట్టణంలోని పోలీసుస్టేషన్‌ను శనివారం వేకువజామున ఆకస్మికంగా సందర్శించారు. దీనిలో భాగంగా స్టేషన్ పరిధిలో రాత్రి బీట్ నిర్వహించే సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్నారు.

విధుల్లో ఉన్నవారు వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించి నేర నియంత్రణకు తోడ్పడాలని సూచించారు. జిల్లా పోలీసు కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి వచ్చే డయల్ 100, 112 కాల్స్‌పై తక్షణమే స్పందించాలన్నారు. రాత్రి వేళలో సమస్యతో పోలీస్‌స్టేషన్‌కి వచ్చే బాధితులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. ఆయనతో పాటు ఎస్ఐ సనపల బాలరాజు, పోలీసు సిబ్బంది ఉన్నారు.